

ముంపు శాశ్వత పరిష్కారానికి చర్యలు: కాకినాడ కమిషనర్ - 8లో

అభివృద్ధిపై దృష్టి సారించాలి
» పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప - 8లో



కాకినాడ పోర్టులో బియ్యం ఎగుమతులను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

బియ్యం దొంగలపై ఉక్కుపాదం





కలెక్టరేట్‌లో రైస్‌మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నాదెండ్ల, చిత్రంలో ఎంపీ, తంగెళ్ల, ఎమ్మెల్యే నానాజీ కలెక్టర్, జేసీ తదితరులు

హాజరైన రేషన్‌డీలర్లు

» వైసీపీ ఐదేళ్లపాలనలో కాకినాడ కేంద్రంగా అక్రమంగా బియ్యం రవాణా
» అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశించి దోషుల ఆటకట్టిస్తాం
» సరుకుల సరఫరాలో తేడాలుంటే ఫిర్యాదుకు జూలై 1 నుంచి వాట్సాప్ సేవలు
» మిల్లర్లతోపాటు వివిధ అసోసియేషన్ల సమావేశంలో మంత్రి నాదెండ్ల
» రెండోరోజు కాకినాడ యాంకరేజ్‌పోర్టులో తనిఖీలతో అంతా హడల్
» రేషన్‌బియ్యం ఎగుమతి అవుతుందనే అనుమానాలతో బార్జీల్లో ఆరా
» ఆఫ్రికాకు ఎగుమతవుతున్న బ్రోకెన్ బియ్యం నాణ్యత చూస్తే సిగ్గేస్తోందని ఆగ్రహం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్, జూన్ 29: రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో బియ్యం కుంభకోణానికి అడ్డూఅదుపూ లేకుండా పోయింది. కాకినాడ కేంద్రంగా వ్యవస్థీకృతమైన బియ్యం మాఫియా విదేశాలకు భారీగా ఎగుమతి చేసి కోట్లు సంపాదించింది. మాజీ ఎమ్మెల్యే ద్వారం పూడి అత్యంత దారుణంగా బియ్యం మాఫియాను నడిపిస్తున్నారు. వీటన్నింటిపై సమగ్ర వివరాలు సేకరించి నివేదిక తయారు చేసి సీఐడీ చేతికి ఇవ్వబోతున్నామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రేషన్ బియ్యం మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ప్రకటించారు.

రెండోరోజు పర్యటనలో భాగంగా మంత్రి కలెక్టరేట్‌లో శనివారం హమాలీలు, రేషన్ డీలర్లు, పెట్రోల్ బంకుల డీలర్లు, పీఏసీఎస్ ఉద్యోగులు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్, వినియోగదారుల అసోసియేషన్, ఎన్‌జీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో బియ్యం మాఫియా ఆటలు సాగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేసు సీఐడీకి అప్పగించి అక్రమార్కులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలి రోజు తనిఖీ బృందాల దాడుల్లో 7,615మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం సీజ్ చేశామన్నారు. దీనికి బాధ్యులైన లావన్ ఇంటర్నేషనల్, అయ్యప్ప ఎక్స్‌పోర్ట్స్, విశ్వప్రియ, సరళ ఫుడ్స్, సార్టెక్స్ ఇండియా, వీఎస్ రాజు గోదాములపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసంవల్ల రాష్ట్రానికి రూ.15లక్షల కోట్ల అప్పులు మిగిలాయన్నారు. రైతులకు రూ.1,600కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉండగా తొలిదఫా రూ.వెయ్యి కోట్లు చెల్లిస్తామన్నారు. నాలుగైదురోజుల్లో రైతుల ఖాతాల్లో తమ సొమ్ములు జమవుతాయన్నారు. మిగిలిన ధాన్యం సొమ్మును కూడా చెల్లించేందుకు నాబార్డు వంటి బ్యాంకులతో సంప్రదింపులు చేస్తామన్నారు.కౌలురైతులకు కూడా ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.

వైసీపీ ప్రభుత్వంవల్ల హమాలీస్‌కు నష్టం

వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలవల్ల జిల్లాలో హమాలీస్‌కు నష్టం జరిగిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సివిల్ సప్లయిస్ హమాలీస్ యూనియన్ అధ్యక్షుడు తలాటం వీరవెంకటరావు మంత్రి నాదెండ్ల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రూట్ ఎస్టిమేషన్ పేరుతో రేషన్‌షాపులను ఎంఎల్ఎస్ పాయింట్లనుంచి కుదించి వేరొక పాయింట్లలో కలపడంవల్ల దివిలి, గొల్లప్రోలు హమాలీలు రోడ్డున పడ్డారన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలకు న్యాయం చేస్తామని, ఈఎస్ఐ ఆస్పత్రిలో వైద్యసేవలు అందేలా చూస్తామని మంత్రి నాదెండ్ల హామీ ఇచ్చారు. ధాన్యం సేకరించే సమయంలో టెక్నికల్ సిబ్బంది లేక అనేక ఇబ్బందులు పడు తున్నామని పీఏసీఎస్ ఉద్యోగి వెంకట రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని పరిశీలిస్తామని మంత్రి నాదెండ్ల బదులిచ్చారు. తమకు వచ్చే సరుకులో 30 క్వింటాళ్లకు రెండు క్వింటాళ్ల వరకు తరుగు వస్తుందని, దీనివల్ల రేషన్ డీలర్లు నష్టపోతున్నారని వలసపాకల డీలర్ పల్లయ్య వాపోయారు. రేషన్‌డీలర్‌కు నష్టం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి మాట్లాడుతూ జూలై ఒకటినుంచి వాట్సాప్ మెసేజ్ పంపితే చర్యలు తీసుకునే విధానం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. తరుగు ఉంటే ఫొటోతీసి వాట్సాప్‌ద్వారా పంపితే చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ డీజిల్ రాకుండా చర్యలు చేపట్టాలి

జిల్లాలో రైస్‌మిల్లర్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు రామకృష్ణ కోరారు. ప్రభుత్వం ఇచ్చే ధర కంటే అధిక ధరలకే ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతుకు ఏకష్టం రాకుండా మిల్లర్లు చూడాల్సిన బాధ్యత ఉందని మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. యానాం నుంచి అక్రమంగా జిల్లాలోకి పెట్రోల్, డీజిల్ తరలించకుండా చర్యలు తీసుకోవాలని పెట్రోల్ బంకుల అసోసియేషన్ ప్రతినిధి కోరారు. ఏపీకి, యానాంకు మధ్య లీటర్‌కి రూ.12 నుంచి రూ.13 తేడా వస్తుందని, దీనివల్ల అక్రమంగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై గట్టి నిఘా పెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

వైసీపీ ప్రభుత్వంలో కౌలురైతుకు నష్టం

వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో కౌలు రైతుకు తీవ్ర నష్టం జరిగిందని ఏపీ కౌలు రైతులు సంఘం జిల్లా కార్యదర్శి రాజుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కౌలుకార్డు ఇవ్వాలంటే భూయజమాని సంతకం పెట్టాలనే రూల్ ప్రవేశపెట్టడంవల్ల కౌలు రైతుకు ఇబ్బందులు వచ్చాయన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు లేకపోవడంవల్ల జిల్లాలో చాలామంది కౌలు రైతులకు ఎలాంటి పథకాలు అందలేదన్నారు. జనసేనాని పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కౌలురైతుల కుటుంబాలకు పెద్దఎత్తున ఆర్థిక సాయం చేశామని మంత్రి నాదెండ్ల తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన అందరి కౌలురైతులకు కార్డులు ఇస్తామన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో టెక్నీషియన్ 17శాతం తేమ ఉందంటే తీరా ఆ ధాన్యాన్ని మిల్లర్ వద్దకు తీసుకువెళ్తే దానిలో 18, 19 తేమశాతం ఉందని బస్తాకు రూ.100 నుంచి రూ.200 తీసుకుంటున్నారని రైతు సంఘం ప్రతినిధి పేర్కొన్నారు. నిత్యం ఇంట్లో వినియోగించే టీ పొడిని కూడా రేషన్ జాబితాలో చేర్చి ప్రజలకు సరఫరా చేస్తే బాగుంటుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సూచించారు. దీనిపై పౌరసరఫరాలశాఖ ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని మంత్రి నాదెండ్ల బదులిచ్చారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పౌరసరఫరాలశాఖ ఎండీ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్‌వో తిప్పేనాయక్ పాల్గొన్నారు.

వరుస తనిఖీలతో హడల్..

రెండోరోజు వరుస ఆకస్మిక తనిఖీలతో మంత్రి నాదెండ్ల అక్రమార్కులకు వణుకు పుట్టించారు. తొలిరోజు బియ్యం గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, శనివారం కాకినాడ యాంకరేజ్ పోర్టులో తనిఖీలు చేశారు. ఆఫ్రికా దేశాలకు ఎగుమతి అవుతున్న బ్రోకెన్ రైస్‌లో రేషన్‌బియ్యం ఉన్నాయేమోనన్న అనుమానంతో బార్జీలను తనిఖీ చేశారు. ఎవరెవరు ఎంత పరిమాణంలో విదేశాలకు పోర్టు ద్వారా బియ్యం ఎగుమతి చేస్తున్నారని, ఈ బియ్యం ఎక్కడినుంచి వస్తుందని పోర్టు అధికారిని మంత్రి ప్రశ్నించారు. ఎక్కడెక్కడ నుంచి, ఎంత అనేది తమకు సంబంధం ఉండదని పోర్టు అధికారి వివరించడంతో మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటువంటి కీలక సమాచారంపై పోర్టు అధికారులు దృష్టిపెట్టకపోవడం సరికాదని హెచ్చరించారు. అనంతరం మంత్రి సమీపంలోని అశోకా, హెచ్1 బియ్యం గోదాములను తనిఖీ చేశారు. వేల బస్తాల్లో ఎగుమతికి సిద్ధంగా ఉన్న బియ్యంలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేశారనే అనుమానంతో వాటి శాంపిళ్లను సేకరించారు. స్టాకు రిజిస్టర్లలో వ్యత్యాసాలను గుర్తించారు. ఈ రెండు బియ్యం గోదాముల్లో 5,300 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఇంకా విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పోర్టులో మంత్రి మాట్లాడుతూ పేదలకు అందాల్సిన బియ్యాన్ని వారి పొట్టకొట్టి అక్రమంగా ఆఫ్రికన్ ఆదేశాలకు తరలిస్తూ భారీ అవినీతికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాంకరేజ్ పోర్టు గురించి పత్రికల్లో చదివానని, కానీ ఇక్కడకు వచ్చాక జరుగుతున్న బియ్యం కార్యకలాపాలను చూసి ఆశ్చర్యానికి లోనయ్యానన్నారు. రేషన్‌బియ్యాన్ని అక్రమంగా రీసైక్లింగ్ చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు డిప్యూటీ సీఎం పవన్ రాక

» మూడు రోజులపాటు పర్యటన
» 1న పింఛన్ల పంపిణీ
» 2న కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష
» 3న పిఠాపురంలో వారాహి సభ
» ఏర్పాట్లపై అధికారుల పరిశీలన

- 7లో



ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జిల్లా పర్యటనకు

ఏర్పాట్లు చేపట్టండి

» అధికారులకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశం

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 29: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జూలై 1నుంచి మూడు రోజులపాటు జిల్లాలో పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ కోర్టుహాల్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమన్వయ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జూలై 1వతేదీ నుంచి 3వ తేదీ వరకు పిఠాపురం నియోజకవర్గంలోను, కాకినాడలోను పర్యటిస్తారని తెలిపారు. జూలై 1న గొల్లప్రోలు చేరుకుని ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు విల్లాస్ సత్యకృష్ణ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ప్రణాళిక, ఏర్పాట్లను చేపట్టాలని డీఆర్డీఏ పీడీకి సూచించారు. జూలై 2వతేదీన ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు ఉపముఖ్యమంత్రి డ్వామా, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, జడ్పీ, పర్యావరణశాఖల అధికారులతో శాఖలవారీగా అమలౌతున్న కార్యక్రమాలు, చేపట్టాల్సిన పనులపై సమీక్షిస్తారన్నారు. ఈ సమీక్షకు ఆయా శాఖలు సమగ్ర సమాచారంతో సంబంధిత అధికారులు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. జూలై 3వతేదీ ఉదయం 10.45 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉప్పాడ తీరంలో సముద్ర కోతకు గురైన ప్రాంతాలను సందర్శించి తీర రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, నిపుణులతో చర్చిస్తారన్నారు. ఉప్పాడతీరం పూర్వం ఏవిధంగా ఉండేది.. ప్రస్తుతం ఎలాఉన్నది ఉపముఖ్యమంత్రికి వివరించేందుకు ఛాయాచిత్రాలు, మాప్‌లను సందర్శన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులకు సూచించారు. 3వతేదీన సాయంత్రం 4గంటలకు పిఠాపురంలో నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన వారాహి సభలో పాల్గొంటారని, సభా ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజలకు తాగునీరు. అంబులెన్సులు తదితర ఏర్పాట్లను చేపట్టాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ఈ ఏర్పాట్లు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్‌వో తిప్పేనాయక్, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, డీపీవో భారతి సౌజన్య, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ పాల్గొన్నారు.

కరపలో గాలివాన బీభత్సం - 7లో

గూగుల్‌లో రూ.67 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం - 7లో

» జేఎన్‌టీయూకే విద్యార్థికి వీసీ అభినందనలు

జేఎన్టీయూకే వీసీ పదవికి రాజీనామా చేయనున్న ప్రసాదరాజు - మెయిన్‌లో

వాకతిప్పలో రిజర్వాయర్‌లో పడి వ్యక్తి మృతి - 7లో

పరిసరాల పరిశుభ్రతపై విస్తృత అవగాహన చేయాలి

» డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్



స్టాప్ డయేరియా పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

జీజీహెచ్(కాకినాడ), జూన్ 29: పరిసరాల పరిశుభ్రతపై విస్తృతంగా అవగాహన కల్పించి సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యం చేసి డయేరియాను నిలుపుదల చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ కోరారు. కాకినాడ జిల్లా వైద్యఆరోగ్య కార్యాలయంలో స్టాప్ డయేరియా పోస్టర్‌ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31వ వరకు 'స్టాప్ డయేరియా' క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అన్నీ పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో సెంటర్లకు ప్రచార సామాగ్రి పంపిస్తామన్నారు. 2,70,000 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 90వేలు జింక్ టాబ్లెట్లు, 2వేలు జింక్ సిరప్‌లు, 7రకాల పోస్టర్లు, పాంప్లెట్లు పంపించారన్నారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. ప్రతి ఆరోగ్య ఉపకేంద్రంలో పారిశుధ్య కార్యక్రమం, ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం ప్రతి శుక్రవారం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లప్రోలులో డయేరియా జాడలు

» రోజూ 15మందికి పైగా ఆస్పత్రులకు వస్తున్న బాధితులు



గొల్లప్రోలు పట్టణం దేవీనగరంలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

గొల్లప్రోలు, జూన్ 29: గొల్లప్రోలు పట్టణంలో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. ప్రతిరోజూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ రోగులు చికిత్స నిమిత్తం వస్తున్నారు. పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌కు శనివారం ఐదుగురు, పీహెచ్‌సీకి నలుగురు విరోచనాలతో బాధపడుతూ వచ్చి చికిత్స పొందారు. ప్రైవేటు ఆస్పత్రులకు రోజూ 15మందికి పైగా చికిత్స పొందుతున్నట్లు చెబుతున్నారు. పట్టణంలోని దేవీనగరం, శెట్టిబలిజపేట, ఎస్సీ కాలనీ, అరుంధతీయపేట తదితర ప్రాంతాల్లో కేసులు ఎక్కువ ఉన్నట్లు సమాచారం. పట్టణంలో నెలకొన్న అధ్వాన పారిశుధ్యం, కుళాయిల ద్వారా కలుషిత జలాలు సరఫరా అవుతుండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కుళాయిలు ద్వారా రంగుమారిన నీరు వస్తోందని, ఇది వాసన కూడా వస్తోందని పట్టణ వాసులు తెలిపారు. పట్టణంలోని ఫిల్టర్‌బెడ్‌లను సరిగా నిర్వహించకపోవడంతో అక్కడంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. తాగునీరు శుభ్రం కావడం లేదని కొంత కాలంగా ఆరోపణలున్నాయి. వీటి మరమ్మతులకు లక్షలాది రూపాయిలు పెడుతూ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, పనులు మాత్రం చేయడం లేదని ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆరోపించారు. వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, నీరు నిలిచిపోయి దుర్గంధపూరిత వాతావరణం నెలకొంటున్నా చర్యలు ఉండడం లేదని ఆ సమావేశంలో పలువురు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారయంత్రాంగం తక్షణం స్పందించి పారిశుధ్యం మెరుగుకు, సురక్షితమైన తాగునీరు సరఫరాఅయ్యేలా చర్యలు తీసుకోవాలని, డయేరియా నియంత్రణపై వైద్యసిబ్బంది దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

కాకినాడ నగర పారిశుధ్యంపై

ప్రత్యేక దృష్టిపెట్టాలి

» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 29: కాకినాడ పట్టణం పరిధిలో పారిశుధ్యం, తాగునీరు సరఫరా అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ నగరపాలకసంస్థ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో నగరపాలక సంస్థ కార్యకలాపాలపై కార్పొరేషన్ కమిషనర్, వివిధ విభాగాల అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ పట్టణం పరిధిలోని 56 వార్డుల్లో పారిశుధ్యం వ్యవస్థ మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ వాసులకు పరిశుభ్రమైన తాగునీరు సరఫరా జరిగేలా చూడాలన్నారు. ప్రధానంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టిన పనుల్లో పురోగతి కనబర్చాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కాకినాడ కమిషనర్ వెంకటరావు, ఏడీసీ నాగనరసింహారావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ సత్యకుమారి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ ఎంపీపీ పదవికి

రాజీనామా

సర్పవరంజంక్షన్, జూన్ 29: కాకినాడ రూరల్ ఎంపీపీ పదవికి గోపిశెట్టి పద్మజ రాజీనామా చేశారు. శనివారం తన రాజీనామా లేఖను భర్త గోపిశెట్టి బాబ్జి, వైసీపీ నాయకులు పుల్ల చందూ, తోటకూర శ్రీనివాస్‌లతో కలిసి జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తికి అందించారు. వ్యక్తిగత కారణాలతో ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తనపై నమ్మకంతో వైసీపీ తరపున కొవ్వాడ ఎంపీటీసీ టిక్కెట్ ఇచ్చి కాకినాడరూరల్ ఎంపీపీగా చేసిన కన్నబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ పదవికి రాజీనామా చేసినా ఎంపీటీసీగా కొనసాగుతానన్నారు.

జంటిల్‌మెన్ ఒప్పందం అమలు కోసమేనా?

కాకినాడ రూరల్ ఎంపీపీగా 2021, సెప్టెంబరు 25న వైసీపీకి చెందిన కొవ్వాడ ఎంపీటీసీ గోపిశెట్టి పద్మజ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ పదవి కోసం అప్పట్లో సర్పవరానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు పుల్ల కోటేశ్వరరావు భార్య ఎంపీటీసీ పుల్ల వెంకటలక్ష్మి పోటీపడ్డారు. ఆ సమయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ సమక్షంలో ఎంపీపీ పదవిపై జెంటిల్‌మెన్ ఒప్పందం చేశారు. గోపిశెట్టి పద్మజ, పుల్ల వెంకటలక్ష్మి చెరో రెండున్నరేళ్ల పాటు ఎంపీపీ పదవి చేపట్టేలా ఒప్పందం చేసుకున్నారు. తొలిరెండున్నరేళ్లపాటు పూర్తి కావడంతో ఎంపీపీ పదవికి పద్మజ రాజీనామా చేశారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకున్నారు

» కౌన్సిల్ అనుమతి ఎందుకు తీసుకోలేదు
» చైర్‌పర్సన్, అధికారుల తీరుపై టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల ఆగ్రహం
» నిరసనగా వాకౌట్
» కోరం లేక కౌన్సిల్ సమావేశం వాయిదా



పిఠాపురం మునిసిపల్ సమావేశంలో కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టీడీపీ ఫ్లోర్‌లీడర్ నగేష్ తదితరులు



పిఠాపురం మునిసిపల్ సమావేశం నుంచి వాకౌట్ చేసి వెళ్లిపోతున్న కౌన్సిలర్లు

పిఠాపురం, జూన్ 29: అత్యవసరమైన పారిశుధ్య విభాగంలో 30మంది కార్మికులను నియమించాలని కౌన్సిల్ తీర్మానిస్తే వారిని నియమించకుండా దొడ్డిదోవన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎలా నియమించారని, కౌన్సిల్ అనుమతి ఎందుకు తీసుకోలేదని టీడీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. చైర్‌పర్సన్, అధికారుల తీరుకు నిరసనగా సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేయడంతో కోరం లేక వాయిదా వేశారు.

నిబంధనలకు విరుద్ధంగా ఆ ఏడుగురి నియామకం

పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. సహచర కౌన్సిలరు రాంబాబు మరణిస్తే కనీసం కౌన్సిల్ తరపున లేదా కార్యాలయం తరపున వెళ్లి పరామర్శించకపోవడాన్ని టీడీపీ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్ తప్పుబట్టారు. అనంతరం రాంబాబు మృతికి కౌన్సిల్ సమావేశం సంతాపం ప్రకటించింది. నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అజెండాలోని అంశాల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా అల్లవరపు నగేష్ మాట్లాడుతూ పురపాలకసంఘంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఏడుగురిని ఏ విధంగా నియమించారని ప్రశ్నించారు. నగేష్‌తోపాటు టీడీపీ కౌన్సిలర్లు పంపనబోయిన అన్నపూర్ణ, రాయుడు శ్రీనులు ఇదే విషయాన్ని ప్రస్తావించగా పలువురు వైసీపీ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. అత్యవసరంగా పారిశుధ్య విభాగంలో 30మంది కార్మికులను నియమించాలని కౌన్సిల్ తీర్మానించగా, ఇప్పటివరకూ వారిని నియమించలేదని, అత్యవసరంగా, నిబంధనలకు విరుద్ధంగా ఏడుగురిని మాత్రం నియమించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో ఉద్యోగానికి రూ.10లక్షలు వంతున వసూలు చేసి అమ్మేసుకున్నారని ఆరోపించారు. దీన్ని కౌన్సిల్ అజెండాలోకి తీసుకురావాలని చెప్పినా ఎందుకు తీసుకురాలేదని కమిషనరును ప్రశ్నించారు. దీనిపై కమిషనరు కనకారావు సమాధానమిస్తూ ఏడుగురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ ద్వారా అప్పటి ఎమ్మెల్యే ప్రమేయంతో ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో నియమించినట్లు తెలిపారు. ఇది తాను విధుల్లోకి చేరకముందే గత డిసెంబరులోనే ప్రతిపాదనలు వెళ్లినట్లు చెప్పారు. ప్రస్తుతం ఇద్దరే విధుల్లో ఉన్నారని, వారికి జీతాలు చెల్లించలేదని తెలిపారు. పట్టణంలోని మార్కెట్‌లో ఆక్రమణలు అధికమయ్యాయని సభ్యులు ఆరోపించారు. తాము ప్రస్తావించిన విషయాలపై అధికారులు సరిగా స్పందించడం లేదని, తమ అనుమతి తీసుకోకుండా ఉద్యోగులను నియమించుకుంటున్నారని, చైర్‌పర్సన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతూ టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు 24మంది సమావేశం నుంచి వాకౌట్ చేశారు. దీంతో సమావేశానికి సరిపడా కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.

భారీగా అవినీతి జరిగింది

పిఠాపురం పురపాలకసంఘ పరిధిలో గత రెండున్నర సంవత్సరాల కాలంలో భారీగా అవినీతి చోటు చేసుకుందని, పనులు చేయకుండానే బిల్లులు చేసి లక్షలాది రూపాయిలు స్వాహా చేశారని టీడీపీ కౌన్సిలర్లు పంపనబోయిన అన్నపూర్ణ, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను ఆరోపించారు. అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. పురపాలక సంఘంలో ఏడు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలను కోటి రూపాయిలకు అమ్ముకున్నారని తెలిపారు. ఐదేళ్లపాటు పిఠాపురం పట్టణాన్ని పట్టించుకోకుండా ఎన్నికల ముందు రూ.60లక్షల పనులను అప్పటి ఎంపీ ప్రతిపాదించి తమ వారికి కట్టబెట్టారని విమర్శించారు. పదవ సచివాలయంలో కాంపౌండ్‌వాల్ నిర్మించి, చదును చేయాల్సి ఉండగా, పనులు చేయకుండా పూర్తయినట్లు బిల్లులు డ్రా చేశారని ఆరోపించారు. మహాశివరాత్రి సందర్భంగా వైసీపీ రంగులతో సీరియల్ లైట్లు పెట్టి వాటి కోసం రూ.5లక్షలు బిల్లు పెట్టారని, ఇందులో పదో వంతు కూడా ఖర్చు కాదని తెలిపారు.

జగన్ కళ్లల్లో ఆనందం కోసం..

నిర్వాసితులను ముంచేశారు..!

పునరావాసం ఇవ్వకుండా నిర్వాసితులను తరిమేసిన వైనం

జగన్‌తో శభాష్ అనిపించుకోవడమే లక్ష్యంగా ఆ అధికారి పని

నేటికీ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంలో ఆయనదే పెత్తనం

(రంపచోడవరం): కేవలం జగన్ కళ్లలో ఆనందం కోసం పని చేసిన అధికారులలో ఆయన ఒకరు. జగన్ వద్ద తన ఉనికి కోసం పోలవరం ప్రాజెక్టు పునరావాస వ్యవస్థను వినియోగించుకుని ఏకంగా జగన్ మన్ననలు పొంది నిర్వాసితులను ముంచేసిన వైనమిది. సదరు అధికారిని పిఠాపురం రిటర్నింగ్ అధికారిగా నియమిస్తే ఈయన పనితనాన్ని ముందే గుర్తించిన జనసేన నాయకులు చేసిన ఫిర్యాదుతో ఎన్నికల సంఘం ఆయన్ను వేరే జిల్లాకు పంపేసిన ఉదంతం తెలిసిందే! సదరు అధికారి పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన ప్రజల త్యాగాన్ని, పునరావాసాన్ని విస్మరించి, పరిహారం ఇవ్వకుండానే భూములను లాగేసుకుని, గ్రామాలను ఖాళీ చేయించడాన్నే ప్రగతిగా చాటుకుని నిర్వాసితుల ఆవేదనకు కారణమయ్యారు. పోలవరం ప్రధాన కాలువల పనులను మాత్రమే చేయగలిగిన కాంగ్రెస్ ప్రభుత్వం తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కేంద్రం సహకారంతో జాతీయ ప్రాజెక్టుగా పోలవరం పనులను పరుగులు పెట్టించి 2019 ఎన్నికలు వచ్చేనాటికి 67 శాతం ప్రగతి సాధించిన సంగతి తెలిసిందే! అంతవరకూ పోలవరంపై పలు విమర్శలు చేసిన వైసీపీ, జగన్‌ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాక కేవలం రివర్స్ టెండరింగ్ తప్ప పురోగతిని గాలికి వదిలేసి అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయారు. చంద్రబాబు ప్రభుత్వం సాధించిన ప్రగతిని మించి ప్రగతిని సాధించలేకపోయారు. రాజ్యసభకు 2019 నాటికి ఇచ్చిన సమాచారం ప్రకారం అప్పటికి ప్రాజెక్టు ప్రగతి 67.09 శాతం కాగా తాజాగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ డ్యాష్‌బోర్డు సమాచారం ప్రకారం నేడు అది 73.59 శాతంగా ఉంది. అంటే ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కేవలం 6.5 శాతం ప్రగతినే సాధించింది. నిర్వాసితుల పునరావాసాన్ని చూస్తే 56,495 నిర్వాసిత కుటుంబాలకు గానూ 12,797 నిర్వాసిత కుటుంబాలకు మాత్రమే పునరావాసాన్ని అమలు చేశారు. 371 ఆవాసాలకు గానూ 100 లోపు ఆవాసాలను మాత్రమే తరలించగలిగారు. అదీ కూడా పునరావాసాన్ని పూర్తి చేయకుండా తరలించినవే అధికం. నిర్మించాల్సిన 193 పునరావాస కాలనీలలో కనీసం సగం కాలనీలను కూడా పూర్తి చేయలేదు. మొత్తంగా చూస్తే ప్రాజెక్టులో అన్ని అంశాలను కలిపిన ప్రగతి 50 శాతాన్ని కూడా దాటలేదని పోలవరం ప్రాజెక్టు అథారిటీ తన వెబ్‌సైట్లోనే తేల్చి చెప్పింది. 2019లో వైసీపీ పాలనా పగ్గాలు చేపట్టాక పునరావాసం ఇవ్వకుండానే 59 ఆవాసాలను ఖాళీ చేయించేశారు. 2019 ఎన్నికలకు ముందు పునరావాస ప్యాకేజీని పెంచుతామని, గతంలో తక్కువ పరిహారం పొందిన నిర్వాసితులకు పరిహారాన్ని పెంచుతామని ఇచ్చిన హామీలు ఐదేళ్లు గడిచినా అమలు చేయని దుస్థితి. ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా వారి గ్రామాలను ముంచేయడం సరికాదని చంద్రబాబు ప్రభుత్వం భావించి పునరావాసానికే ప్రాధాన్యమిచ్చారు. నిర్మాణ పనులతో పాటు పునరావాస చర్యలనూ ఆయన సమీక్షించేవారు. నిర్వాసితులను దృష్టిలో ఉంచుకుని కాఫర్‌డ్యామ్ పక్క నుంచి గోదావరి జలాలు వెళ్లడానికి ఏ ఆటంకం లేకుండా చంద్రబాబు చూస్తే జగన్ మాత్రం నిర్వాసితులను ముంచే దిశగా కాఫర్‌డ్యామ్‌ను పూర్తి చేసి, దాని ఎత్తును పెంచేసి నిర్వాసితులకు పొమ్మనకుండానే పొగపెట్టారు. ఫలితంగా పరిహారం, పునరావాసం లేకుండానే నిర్వాసితులు గ్రామాలను వదిలి వెళ్లారు. ఇదిలా ఉండగా గత నాలుగేళ్లుగా విలీన మండలాలు ప్రతి ఏటా ఊహించని వరదను ఎదుర్కొన్నాయి.

ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం

పునరావాసాన్ని అమలు చేయాల్సిన అధికారులు ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని కనబర్చి ఎటువంటి వ్యయం లేకుండా నిర్వాసితులను ఖాళీ చేయించామన్న ప్రగతిని చాటుకుని ఇంతకు ముందు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసిన వివాదాస్పద అధికారి ఒకరు జగన్‌తో శభాష్ అనిపించుకున్నారు. ఈ ట్రాక్ రికార్డుతో పిఠాపురం రిటర్నింగ్ అధికారిగా నియమించబడిన సదరు అధికారిని జనసేన ఫిర్యాదుతో ఎన్నికల సంఘం వేరే జిల్లాకు పంపేసిన సంగతి తెలిసిందే! ఆయన హయాంలోనే ఆయనకు అనుబంధంగా నడిచే భూసేకరణ తదితర అంశాలలో అనేక అక్రమాలు కూడా చోటు చేసుకోగా ఏకంగా స్పెషల్ కలెక్టర్‌తో సహా పలువురు అధికారులు, దళారులు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. అప్పటికే జగన్‌తో భుజం తట్టించుకుని శభాష్ అనిపించుకున్న సదరు అధికారి నిర్వాసితులకు భూమికి బదులుగా భూమిని ఇచ్చేందుకు సిద్ధమైన రైతులపైనే కేసులు పెట్టి పరిహారం సొమ్మును ఎగ్గొట్టి మరోసారి మన్ననలను పొందాలని చూశారు. కాగా వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి రక్షణ పొందారు. బదిలీపై వెళ్లిపోయినా ఆయన ప్రభావమే ఇంకా ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయంపై ఉందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఓ నిర్వాసితుడు ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం కూడా ఈ కార్యాలయానికి సంబంధించిందే! గతంలో తెలుగుదేశానికి చెందిన ఎమ్మెల్యేను నేల మీద కూర్చొబెట్టి అహం ప్రదర్శించిన చరిత్ర కూడా ఈ అధికారిదే కావడం గమనార్హం.

'కగార్ వ్యతిరేక దినం పాటించాలి'

ఎటపాక, జూన్ 29: జూలై 1న ప్రపంచ కగార్ వ్యతిరేక దినంగా పాటించాలని కోరుతూ మావోయిస్టు భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ (బీకే-ఏఎస్ఆర్) మావోయిస్టు ఆజాద్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో శనివారం ఓ ప్రకటన విడుదలైంది. భారత ప్రజాయుద్ధ అంతర్జాతీయ సంఘీభావ కమిటీ పిలుపు మేరకు కగార్ వ్యతిరేక దినం పాటిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఇటీవల 2024, జనవరి నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో ప్రజాయుద్ధాన్ని తుదకంటూ నిర్మూలించడానికి భారత కేంద్ర, రాష్ట్రాల దోపిడీ పాలక వర్గాలు ఒక నూతన ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ఈ ఆపరేషన్ సైనిక క్యాంపెయిన్‌లో ఇప్పటివరకు 125 మందికి పైగా విప్లవప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకత్వ పీఎల్‌జీఏ యోధులను హత్య చేసినట్లు తెలిపారు. దేశ ప్రజలపై కగార్ దాడులు ఆపాలని ప్రపంచ దేశాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. కగార్ వ్యతిరేక దినం రోజున డివిజన్ వ్యాప్తంగా ఉన్న పలు విప్లవ సంస్థల శక్తులు, ప్రజాస్వామిక వాదులు, పాత్రికేయులు, రచయితలు, కళాకారులు, ఆదివాసీ సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు వివిధ రూపాల్లో కగార్ సైనిక దాడులను ఖండించాలని లేఖలో పిలుపునిచ్చారు.

రేపు డిప్యూటీ సీఎం పవన్ రాక

మూడు రోజులు పాటు పర్యటన

1న పింఛన్ల పంపిణీ

2న కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

3న పిఠాపురంలో వారాహి సభ

ఏర్పాట్లపై అధికారుల పరిశీలన



ఏర్పాట్లపై చర్చిస్తున్న నాయకులు, అధికారులు

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 29: జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన అధికారికంగా ఖరారయింది. పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికయిన అనంతరం తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి, కాకినాడ జిల్లా పర్యటనకు వస్తున్న జనసేనానికి ఘనస్వాగతం పలికేందుకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సన్నాహాలు చేస్తుండగా, పాల్గొనే కార్యక్రమాల ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. జూలై 1వ తేదీన హైదరాబాద్ నుంచి విమానంలో రాజమహేంద్రవరానికి వచ్చే పవన్‌కల్యాణ్ అక్కడ నుంచి రోడ్డు మార్గాన గొల్లప్రోలు పట్టణంలోని సత్యకృష్ణ కల్యాణ మండపానికి చేరుకుంటారు. అక్కడ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం అనంతరం పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో జరిగే సమావేశంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేస్తారు. 2వ తేదీ ఉదయం చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి కాకినాడ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకూ పంచాయతీరాజ్‌శాఖ, 11.30 నుంచి 12.30 వరకూ ఇరిగేషన్ శాఖ, 1.30 గంటల వరకూ అటవీ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తారు. అనంతరం రోడ్డు కనెక్టవిటీ, రహదారుల పరిస్థితిపై అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. సమావేశం అనంతరం చేబ్రోలు నివాసానికి చేరుకుంటారు. అక్కడ జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశమవుతారు. 3వ తేదీన చేబ్రోలు నివాసం నుంచి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకుని అక్కడ సముద్రపు కోత ప్రాంతాలను పరిశీలిస్తారు. తిరిగి నివాసానికి చేరుకుని పిఠాపురం నియోజకవర్గ అధికారులతో పరిచయ కార్యక్రమం, అనంతరం టీడీపీ, బీజేపీ ముఖ్యనేతల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో జరిగే వారాహి సభలో పవన్‌కల్యాణ్ పాల్గొని తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తారు.

ఏర్పాట్లపై పరిశీలన

గొల్లప్రోలులోని సత్యకృష్ణ కల్యాణ మండపంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులు పరిశీలన జరిపారు. అక్కడ చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు తదితర అంశాలపై సమీక్షించారు. పరిశీలనలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ ఆర్డీవో కిశోర్, డీఎస్పీ హనుమంతరావు, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, డీఎల్‌డీవో నారాయణమూర్తి, సీఐ శ్రీనివాస్, తహసీల్దారు ఉదయభాస్కర్, ఎస్ఐ జాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలు పాటు జిల్లా బహిష్కరణ

కాకినాడ క్రైం, జూన్ 29: కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన నేరస్తుడు గురజాపు దుర్గాప్రసాద్(మొప్పలోడు)ను కాకినాడ జిల్లా నుంచి ఆరు నెలలపాటు బహిష్కరిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేసినట్లు కాకినాడ త్రీటౌన్ ఎస్‌హెచ్‌వో ఎ.కృష్ణభగవాన్ తెలిపారు. కాకినాడ క్రైం పోలీస్‌స్టేషన్ పరిధిలో దుర్గాప్రసాద్‌పై పలు కేసులు ఉండగా అతడిని అరెస్ట్ చేశామన్నారు. అతడు ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, గుండాయిజం, టెర్రర్‌గా ప్రవర్తిస్తూ అవమానిస్తున్నాడని ఫిర్యాదులు వచ్చాయన్నారు. నిందితుడిపై 2023, మే 12న సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశామన్నారు. కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 6 కేసులు ఉన్నాయని, 2014, 2017, 2019ల్లో మంచిగా ఉండేందుకు బౌండ్ ఓవర్ కేసులు పెట్టినా, ప్రజాశాంతికి భంగం కలిగిస్తుండడంతో అతడి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో అతడ్ని కాకినాడ జిల్లానుంచి బహిష్కరణ కోసం జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేయగా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా నుంచి 6 నెలల పాటు బహిష్కరిస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. తక్షణమే కాకినాడ జిల్లా విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లాలని నేరస్తుడు గురజాపు దుర్గాప్రసాద్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి జిల్లాలో ఎక్కడైనా సంచరిస్తున్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గూగుల్‌లో రూ.67 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం



విద్యార్థికి వీసీ అభినందనలు

జేఎన్టీయూకే, జూన్ 29: కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే లో సీఎస్ఈ విభాగంలో ఎంటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న దొండపాటి హేమంత్‌కుమార్ గూగుల్‌లో సెక్యూరిటీ ఎనలిస్ట్‌గా కొలువు సాధించినట్లు యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అత్యధిక ప్యాకేజీ వార్షిక వేతనం రూ.67 లక్షలతో కొలువు సాధించిన హేమంత్‌కుమార్‌ను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బహుళజాతి సంస్థలతో యూసీఈకే కళాశాల ఒప్పందాలు చేసుకోవడం ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీలు అమలు చేస్తున్న అంశాలు, విధి విధానాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా మంచి ప్లేస్‌మెంట్స్ సాధిస్తున్నారన్నారు. గూగుల్ కంపెనీకి సెక్యూరిటీ ఎనలిస్ట్‌గా ఎంపికైన హేమంత్‌కుమార్ స్వస్థలం కాకినాడ కాగా అతడి తండ్రి రాజారావు యూపీహెచ్‌సీలో డీపీవోగాను, తల్లి సూర్యకుమారి విశాఖపట్నం ఆర్టీసీలో ఆరోగ్య విద్యలో ఎక్స్‌టెన్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. యూసీఈకే ప్లేస్‌మెంట్ అధికారిణి డాక్టర్ అరవ కరుణ, సీఎస్ఈ విభాగాధిపతి ఓ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్యాటకులు జాగ్రత్తలు వహించాలి

రంపచోడవరం, జూన్29: రంపచోడవరం మండలం భద్రాచలం హైవేను ఆనుకుని ఉన్న సీతపల్లి వాగు విహార కేంద్రానికి వచ్చే పర్యాటకులు వాగులోకి దిగరాదని, వాగు ప్రమాదభరితంగా ఉందని రంపచోడవరం పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. రంపచోడవరం ఎస్ఐ మోహన్‌కుమార్ ఈ మేరకు మీడియా ద్వారా పర్యాటకులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం కావడంతో పర్యాటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వైసీపీ నేత ఇంటి వద్ద మరో వైసీపీ నేత నిరసన

గత ప్రభుత్వంలో బెదిరించి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపణ

అనపర్తి, జూన్ 29 : అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో వైసీపీ నాయకుడు పడాల హరి సాయికృష్ణారెడ్డి తనకు అన్యాయం చేశాడని ఆర్థిక లావాదేవీలను అడ్డుపెట్టుకుని అప్పటి మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై అసత్య అవినీతి ఆరోపణలు చేయించారంటూ అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ పడాల శ్రీనివాసరెడ్డి హరి సాయికృష్ణారెడ్డి ఇంటి వద్ద టెంటు వేసుకుని నిరసనకు దిగారు. ఇది తెలుసుకున్న పలువురు వలంటీర్లు కూడా తమతో కూడా నల్లమిల్లిపై అనేక పోస్టింగులు పెట్టాలంటూ బెదిరించారంటూ సాయి ఇంటి వద్ద పడాలతో బాటు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ పడాల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తాను అనేక కాంట్రాక్టు వర్కులు చేశానని బిల్లులు రావాల్సి ఉండగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన వద్ద లంచం తీసుకున్నారంటూ వీడియో మాట్లాడాలని సాయి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి ఒత్తిడి తీసుకురావడంతో ఆయన తన వద్ద రూ.18 లక్షలు లంచం తీసుకున్నారంటూ తప్పుడు వీడియో విడుదల చేశానని అన్నారు. అయితే తన బిల్లులు చెల్లించకుండా అడ్డుకున్న సాయి తనతో ఖాళీ నోట్లు, చెక్కులపై సంతకాలు తీసుకున్నారని అవి వారి వద్ద ఉంచుకున్నారని ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో నల్లమిల్లి విజయం సాధించడంతో తాను నల్లమిల్లిని కలిసి క్షమించమని కోరానని ఇక్కడ చూస్తే సాయి తన గోడు వినకుండా తప్పించుకు తిరుగుతున్నాడని చేసేది లేక సాయి ఇంటి వద్ద టెంటు వేసుకుని దీక్ష చేపట్టానని చెప్పారు. తనకు రావలసిన సొమ్ములు ఇచ్చే వరకు నిరసన కొనసాగిస్తానని అన్నారు. పడాల చేపట్టిన నిరసన విషయం తెలుసుకున్న పలువురు వలంటీర్లు అక్కడకు చేరుకుని వారు కూడా నిరసనలో పాల్గొన్నారు. పడాల సాయి, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి కలిసి తమతో నల్లమిల్లిపై తప్పుడు పోస్టింగులు పెట్టించే వారని లేకుంటే ఉద్యోగాలు ఉండవంటూ బెదిరించే వారని చెప్పారు. ఈ విషయంపై పడాల సాయి, సత్తి ఆదిలక్ష్మిలపై చర్యలు చేపట్టాలని అనపర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు మాజీ వలంటీర్ కడియాల రేవతి తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట





వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, జూన్ 29: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వేలాది మంది భక్తజనంతో సందడిగా మారింది. గోవింద నామస్మరణలతో మార్మోగింది. శనివారం వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి స్వర్ణ శోభితుడైన శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు స్వామివారి తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, కానుకలు, తులాభారాలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి చిత్రపటాలు అందజేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.36.26లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ తెలిపారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

ఏఐలో తిరుగులేని శక్తిగా భారత్

ఐటీ నిపుణుడు జక్కంపూడి ఆదిశేషయ్యచౌదరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

గండేపల్లి, జూన్ 29: ఏఐలో తిరుగులేని శక్తిగా భారత్ ఎదుగుతోందని ప్రముఖ ఐటీ నిపుణుడు జక్కంపూడి ఆదిశేషయ్యచౌదరి అన్నారు. గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం 'ఆదిత్య ది ఏఐ కింగ్'లో జక్కంపూడి ఆదిశేషయ్యచౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిత్య ఇండియా స్టార్టప్ ఫౌండేషన్‌ను ఆదిత్య సహకారంతో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆదిత్య ప్రో చాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఫౌండేషన్‌కు ఆదిత్య యూనివర్సిటీ రూ.కోటి రూపాయలు ఫండ్‌ను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. శేషయ్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం తరపున మరో కోటి రూపాయలు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థులు తమతమ ఆలోచనలకు పదునుపెట్టి సరికొత్త స్టార్టప్‌లతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విదేశాల్లో ఉద్యోగం పొందిన వారు లాంగ్వేజ్ పరంగా ఇబ్బందులు ఎదుర్కోవడం చూసి ఈ సంవత్సరం నుంచి తమ యూనివర్సిటీలో హిందీ, ఇంగ్లీష్‌తో పాటు జపనీస్ లాంగ్వేజ్‌లో కూడా శిక్షణ ఇస్తున్నట్లు సతీష్‌రెడ్డి తెలిపారు. ప్రత్యేకించి 250మంది విద్యార్థులకు జపనీస్ లాంగ్వేజ్‌లో శిక్షణిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆదిత్య అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, ఫౌండింగ్ పార్టనర్ 108 కాపిటల్, హైదరాబాద్ ఏంజిల్స్ సీఈవో, పీఎస్ శ్రీకాంత్, ఆదిత్య డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, సీఎస్ఈ డేటా సైన్స్ విభాగాధిపతి వరుణ్‌రావ్, ఏఐ విభాగాధిపతి సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



వాకాడ వద్ద రహదారికి అడ్డంగా చెట్లు



వాకాడబస్ షెల్టర్ వద్ద పడిన చెట్లు

కరప, జూన్ 29: కాకినాడ జిల్లా కరప మండల వ్యాప్తంగా శనివారం తెల్లవారుజామున గాలివాన బీభత్సానికి పలు చెట్లు విరిగిపడ్డాయి. వాకాడలో కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రహదారికి అడ్డంగా నాలుగు చెట్లు, ఒక విద్యుత్ స్తంభం, కూరాడలో రెండు చెట్లు, ఒక విద్యుత్ స్తంభం నేలకొరిగాయి. పెద్దాపురప్పాడులో ఒక ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నట్టు కరప సబ్‌స్టేషన్ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తెలిపారు. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వాకాడ, కూరాడ గ్రామాల్లో పడిన చెట్లను తొలగించి, స్తంభాలను నిలబెట్టి మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఏఈ తెలిపారు. భారీవర్షానికి పలు గ్రామాల్లో ఆకుమడులు మునిగిపోయి చల్లిన విత్తనాలు దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బిక్కవోలు, జూన్ 29: బిక్కవోలులో విద్యుదాఘాతంతో ఊలపల్లి గ్రామానికి చెందిన గొర్త చిన్న (40) అనే హెల్పర్ మృతి చెందాడు. చిన్న గ్రామంలో ఎలక్ట్రికల్ గూడ్స్ షాపు నడుపుకుంటూ లైన్‌మెన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. బిక్కవోలులో విద్యుత్ వైర్ల మరమ్మత్తులు చేయడంతో లైన్‌మన్ కూడా పనులు చేయడానికి వచ్చి శనివారం ఉదయం బిక్కవోలు కాటన్‌బొమ్మ సెంటర్‌లో 11కెవి విద్యుత్ వైర్ల రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు వైర్లకు విద్యుత్ ప్రవహించి షాక్‌కు గురై అక్కడికక్కడే చిన్న మృతి చెందాడు. చిన్న మృతదేహాన్ని ఏఈ కె.బుజ్జిదొరతోటి సిబ్బందితో కిందికి దించారు. ఊలపల్లికి చెందిన బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి వచ్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరడంతో అనపర్తి ఏడీఏ నిరంజన్ డిపార్టుమెంట్ తరపున రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. చిన్న భార్య సత్యకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు.

రూ.10కే అమ్మ భోజనం

రాజానగరం, జూన్ 29: జూలై 1 నుంచి రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిలో రూ.10లకే అమ్మ భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 20వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని జూలై 1న కృష్ణాజిల్లా వాస్తవ్యుడు, న్యూయార్క్ నివాసి సుప్రసిద్ధ రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అమ్మ భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. రూ.10లకే భోజనం రాదని అయితే మిగిలిన డబ్బును జీఎస్ఎల్ గ్రూపు సంస్థలు సబ్సిడీగా సమకూరుస్తాయన్నారు. డాక్టర్ గన్ని సుబ్బలక్ష్మి పేరుతో డాక్టర్ డే రోజైన జూలై 1న రెండు దశాబ్దాల కిందట జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి ఆవిర్భవించిందన్నారు. రోగులకు అందిస్తున్న ఫ్రీ ట్రీట్మెంట్లు, ఫ్రీ ప్రొసీజర్లు, ఫ్రీ సర్జరీల సేవలను మరో నెల రోజులు పాటు పొడిగిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

విద్యుత్ ఉపకరణాల వినియోగంలో జాగ్రత్తలు అవసరం



అవగాహన కల్పిస్తున్న సౌజన్య

బిక్కవోలు, జూన్ 29: విద్యుత్ ఉపకరణాల వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించడం ద్వారా విద్యుత్ ప్రమాదాలు నివారించగలమని రాజమహేంద్రవరం ఉప విద్యుత్ తనిఖీ అధికారి బి.సౌజన్య సూచించారు. బలభద్రపురం గ్రాసిం ఇండస్ట్రీస్‌లో శనివారం ఆమె పారిశ్రామిక విద్యుత్ ప్రమాణాల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈనెల 26 నుంచి జూలై 2వరకూ విద్యుత్ భద్రతను స్వీకరించి జీవితాలను రక్షించండి అనే నినాదంతో జాతీయ విద్యుత్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పరిశ్రమల్లో వివిధ సందర్భాలలో సంభవించే పలు ప్రమాదాలు వివరిస్తూ అవి జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కార్మికులకు వివరించారు. ఈ అవగాహనా సదస్సులను పరిశ్రమలు, పాఠశాలలు, ఆసుపత్రులు, సినిమాహాళ్లు, షాపింగ్ మాల్స్‌లలో నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో గ్రాసిం సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2170 కేసుల పరిష్కారం



కక్షిదారుకు అవార్డు అందజేత

రాజమహేంద్రవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ ద్వారా శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2170 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఆర్.శివకుమార్ తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ప్రతి మూడు నెలలకోసారి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాజీమార్గం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో ఉమ్మడి తూర్పు పరిధిలోని నాలుగు రెవెన్యూ జిల్లాల్లోని కోర్టుల్లో 45 బెంచ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. మోటారు వాహనాల ప్రమాదాల్లో పరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యం నివారించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. పరిష్కారమైన కేసులకు సంబంధించి అవార్డు(తీర్పు)లు అందజేసినట్లు చెప్పారు. శనివారం పరిష్కరించిన కేసుల్లో క్రిమినల్ 1516, సివిల్ 504, ప్రీలిటిగేషన్ 150 ఉన్నాయన్నారు. జాతీయ, ప్రత్యేక లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు త్వరితగతిన న్యాయం పొందే వీలు కలుగుతోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. 5వ అదనపు జిల్లా జడ్జి డి.విజయ్ గౌతమ్, 8వ అదనపు జిల్లా జడ్జి వై.బెన్నయ్య నాయుడు, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, ఎస్పీఈ అండ్ ఏసీబీ కోర్టు స్పెషల్ జడ్జి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

రాజమహేంద్రవరం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలపై పోలీసు అధికారులు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. జూలై 1 నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో పోలీసు అధికారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కొత్త చట్టాలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. భారతీయ న్యాయ సంహితపై మొదటి అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పీపీ(గ్రేడ్-1) జీఎస్‌వీ ప్రసాదరావు, భారతీయ నాగరిక సురక్షా సంహితపై కాకినాడ సబ్ కోర్టు అడిషనల్ పీపీ కె.రాధాకృష్ణ రాజు, భారతీయ సాక్ష్య అధినియంపై మాజీ సీబ్యూసీ చైర్మన్ బి.పద్మావతి అవగాహన కల్పిస్తారన్నారు. అధికారులు, సిబ్బంది సుమారు 300 మంది పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో పడి వ్యక్తి మృతి





కొత్తపల్లి, జూన్ 29: రక్షిత మంచినీటి పథక ట్యాంకులను శుభ్రం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు గట్టుపై కాలు జారి రిజర్వాయర్లో పడి వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలో ఈ సంఘటన శనివారం జరిగింది. వాకతిప్ప గ్రామంలోని సూరప్ప చెరువులో నాగులాపల్లి ఏరియా సమగ్ర గ్రామీణరక్షిత మంచినీటి పథకంలో నీటిని శుభ్రం చేసే ట్యాంక్‌లో క్లీనింగ్ చేయడానికి వలసపాకలకు చెందిన తంగెళ్ల అప్పన్న(25)తో పాటు 8 మంది వచ్చారు. భోజన విరామ సమయంలో తంగెళ్ల అప్పన్నతో పాటు అతడి స్నేహితుడు సాంబ కలిసి రిజర్వాయర్ చెరువు గట్టుపై నుంచి వస్తుండగా కాలు జారి ఇద్దరూ రిజర్వాయర్లో జారారు. ఇది గమనించిన సహచర కూలీలు సాంబను పైకి లాగారు. అప్పటికే అప్పన్న రిజర్వాయర్లోకి పూర్తిగా మునిగి గల్లంతయ్యాడు. కూలీలు అందరూ ఎంత వెతికినా ఆచూకీ దొరకపోవడంతో గజ ఈతగాళ్లు వలలతో రిజర్వాయర్‌లో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. రక్షిత మంచినీటి పథక నిర్వాహకులు ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

నేడు జగ్గంపేటలో భారీ అన్నదానం

జగ్గంపేట, జూన్ 29: స్థానిక శ్రీసర్వకామదాన సమేత ఉమాచంద్రశేఖర్ స్వామి ఆలయంలో ఈ25 నుంచి 29 వరకు స్వామివారి కల్యాణ ఉత్సవాలతో పాటు స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 11గంటల నుంచి ఆలయం నందు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు స్వామివారి అన్నప్రసాదాలు స్వీకరించాలని పిలుపునిచ్చారు.

'విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి'

సామర్లకోట, జూన్ 29: ప్రతీ పాఠశాలలోనూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని అప్పుడే మానసిక పరిపక్వత సాధిస్తారని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు వైకుంఠం పదవీ విరమణ సందర్భంగా ఉపాధ్యాయులు శనివారం నిర్వహించిన కార్యక్రమానికి రాజప్ప ముఖ్యఅతిథిగా హాజరై వైకుంఠం దంపతులకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, కమిషనర్ జాస్తి పాల్గొన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యేగా మూడోసారి గెలుపొందిన చినరాజప్పను జీ.రాగంపేటకు చెందిన ప్రజలు ఎమ్మెల్యే స్వగ్రామం అచ్చంపేట చేరుకుని ఆయన్ని పూలమాలలతో అభినందించారు.

'రక్తదానంతో నిరుపేదలకు పునర్జన్మ'

సర్పవరం జంక్షన్, జూన్ 29: రక్త దానం చేయడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని, ఒకరి రక్తదానంతో ఎందరో నిరుపేదలకు పునర్జన్మ ప్రసాదించినవారు అవుతారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. తన కుమారుడు పంతం సందీప్ పుట్టిన రోజు పురస్కరించుకుని శనివారం కాకినాడలో శ్రీయువసేన బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కరపకు చెందిన దివ్యాంగుడు దున్నే లక్ష్మణరావుకు ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌ని అందించారు. కార్యక్రమంలో శ్రీయువసేన అధ్యక్షుడు బొల్లం సతీష్, జనసేన పార్టీ నాయకులు శాండీ, బన్ను, శిరంగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'పింఛన్ల పంపిణీలో ప్రతి నాయకుడు పాల్గొనాలి'

జగ్గంపేట, జూలై 29: జూలై 1న జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ప్రతి నాయకుడు సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొనాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మండల, టౌన్ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌చార్జ్‌లు, అన్ని పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు జనసేన, బీజేపీ ఎన్‌డీఏ కూటమి నాయకులందరూ ఆయా సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని కోరారు. నాయకులందరూ వార్డులలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని చెప్పారు.

'ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ'

కరప, జూన్ 29: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండలంలోని గురజనాపల్లి గ్రామంలో జూలై 1వ తేదీ ఉదయం ఎమ్మెల్యే ద్వారా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్నట్టు శనివారం ఆయన తెలిపారు. మండలంలో 11,572మంది లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నామన్నారు. పెంచిన పింఛన్ల సొమ్ము రూ.7,75,97,500 ఉండగా, ఇప్పటికే కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, ప్రభుత్వ ఉద్యోగులను సన్నద్ధం చేశామని చెప్పారు.

'విత్తన మార్పిడితో అధిక దిగుబడులు'

తుని రూరల్, జూన్ 29: విత్తన మార్పిడితో అధిక దిగుబడులు సాధ్యమని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దయాకర్, ఏఎస్ఆర్.శర్మ తెలిపారు. తేటగుంటలో రైతులతో సమావేశమైన వారు మెట్ట ప్రాంతంలో ఆర్‌జీఎల్ 2537టీపీటీ5204లాంటి సన్నరకాల విత్తనాలు ఎక్కువ సాగుచేస్తారని, ఈ రకాల సాగులో వచ్చి 30 ఏళ్లు పూర్తి కావడంతో పురుగులు, తెగుళ్లకు లోనై దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. అనంతరం ఆర్‌జీఎల్ 7039, 7034 రకాల కిట్లను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీ భ్రమరాంబ, తుని ఏవో అశోక్‌కుమార్ ఉన్నారు.

'అందరికీ విద్య అందించేందుకు కృషి'

సామర్లకోట, జూన్ 29: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ పాఠశాలలోనూ 90- రోజు విద్యా ప్రణాళికలు అమలు చేయడం ద్వారా అందరికీ విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సామర్లకోట ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సామర్లకోట జగ్గమ్మగారిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో సందర్శించారు. పాఠశాల పరిసరాలు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రద్ధ వహించాలన్నారు. మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును పరిశీలించి రుచి, శుచి, నాణ్యతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

'మహిళా పోలీసుల సమస్యలు పరిష్కరించాలి'

ప్రత్తిపాడు, జూన్ 29: మహిళా పోలీసుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల మహిళా పోలీసులు స్థానిక తోటవీధిలోని టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకు వినతిపత్రం అందజేశారు. మహిళా పోలీసుల సమస్యల్లో ప్రధానమైన సర్వీసు రూల్స్, ప్రమోషన్ చానల్, జాబ్‌చార్ట్, డిపార్టుమెంట్‌పై స్పష్టత తదితరసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా పోలీసుల సంరక్షణ సంఘ ఉపాధ్యక్షురాలు యల్లపు వర్ధిని, మండల అసోసియేషన్ సభ్యులు పి.సుమిత్రి, బి.అనిత తదితరులు పాల్గొన్నారు.

'కౌలురైతు కార్డుల జారీ వేగవంతం చేయాలి'

పెద్దాపురం, జూన్ 29: పెద్దాపురం రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా చేపట్టే కౌలు రైతుల కార్డుల(సీసీఆర్‌సీ) జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆర్డీవో జే.సీతారామారావు ఆయా మండలాల తహశీల్దార్లను ఆదేశించారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో శనివారం 12 మండలాల తహశీల్దార్లు, వ్యవసాయాదికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీపై తహశీల్దార్లు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. కార్యాలయ డీటీ భానుకుమార్, తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

సొసైటీలకు ప్రత్యేకాధికారుల నియామకం

కరప, జూన్ 29: మండలంలోని ఆయా సొసైటీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కరప, జడ్.బావారం, పెద్దాపురప్పాడు, కూరాడ పీఏసీఎస్‌లకు కాకినాడ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.దుర్గాప్రసాద్ ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. కరప పీఏసీఎస్‌లో ఆయన బాధ్యతలు తీసుకుని మాట్లాడారు. వేములవాడ పీఏసీఎస్ ప్రత్యేకాధికారిగా కె.ప్రతాప్‌కుమార్, యండమూరు పీఏసీఎస్ ప్రత్యేకాధికారిగా డి.కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించారు. పెనుగుదురు పీఏసీఎస్ ప్రత్యేకాధికారిగా ఇప్పటికే ఎస్.రవికుమార్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఏలేశ్వరం నగర పంచాయితీ సమావేశం వాయిదా

ఏలేశ్వరం, జూన్ 29: చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన శనివారం జరగాల్సిన నగరపంచాయితీ సాధారణ సమావేశం వాయిదా పడింది. కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా పడినట్టు మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావు, టీపీవో ఆనంద్ తదితర శాఖ అధికారులు సమయం ముగిసే వరకూ కూర్చున్నారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట, జూన్ 29: హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా హనుమాన్ తృతీయ శోభాయాత్రను సామర్లకోట, పెద్దాపురంలో భారీ ఎత్తున నిర్వహించనున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం నుంచి ప్రారంభమై ప్రధానరోడ్‌ల మీదుగా పెద్దాపురం చేరుకుంటుందన్నారు. అనంతరం పెద్దాపురం ప్రధాన రహదారుల మీదుగా శోభాయాత్ర జరుగుతుందన్నారు. సమావేశంలో జీవీకె.మోహనరావు, పోతుల ప్రభాకర్, ఏడుకొండలు, విజ్జు గణేష్, కర్రి రాజు, కర్రి ఆదినారాయణ రెడ్డి, శివయ్య మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధి నివారణపై అవగాహన

సర్పవరం జంక్షన్, జూన్ 29: మధుమేహ వ్యాధి నివారణపై లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో లయన్స్ డిస్ట్రిక్ట్ డయాబిటీస్ స్క్రీనింగ్ క్యాంపులతో అవగాహన కల్పిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ బాదం బాల కృష్ణ కోరారు. శనివారం రమణయ్యపేట శివారు రాయుడుపాలెంలో శ్రీ విజయ గణపతి బ్రాహ్మణ సంఘం భవనంలో లయన్స్ క్లబ్ జూబ్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన డయాబిటీస్ స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్ గోల్డెన్ జూబ్లీ వైస్ ప్రెసిడెంట్ జెజీ ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



పెద్దాపురంలో మాట్లాడుతున్న చినరాజప్ప

పెద్దాపురం, జూన్ 29: పెద్దాపురం పట్టణాభివృద్ధిలో జరగాల్సింది జరిగిపోయింది. పెండింగ్ పడిన అభివృద్ధి పనులపై దృష్టి సారి ద్దాం. గతం గతః, ఇక జరగాల్సిన అభివృద్ధిపై కౌన్సిల్, అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి రాజప్ప గౌరవఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో స్థానిక శతాబ్ది పార్క్ అభివృద్ధిలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం మరీ దారుణంగా ఉందంటూ కౌన్సిల్ మండిపడింది. గత 6 నెలలుగా పార్క్ అభివృద్ధిపై కౌన్సిల్ అధికారులను నిలదీస్తున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంజనీరింగ్ అధికారుల తీరుపై మండిపడ్డారు. విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ గోదావరి మంచినీటి బూస్టర్ లైన్ వద్ద లీకేజీల కారణంగా పట్టణంలో పలుచోట్ల లీకులు ఉన్నాయని వాటిపై దృష్టి సారించి నీటి సరఫరా చేయాలన్నారు. పట్టణంలో గల కమ్యూనిటీ భవనాల విద్యుత్ బిల్లులు మున్సిపాలిటీ చెల్లించడం తగదని ఆయా కమ్యూనిటీ భవనాల నిర్వాహకులే చెల్లించే విధంగా చర్యలు తీసుకుని మున్సిపాల్టీపై భారం పడకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ గతం వదిలిపెట్టండి, ఇప్పుడు పార్క్ అభివృద్ధిని అప్పగిస్తే అధ్వాన్నంగా చేశారన్న విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పుడు పార్క్ అభివృద్ధికి కౌన్సిల్ సమష్టి కృషి చేయాలన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తం కావాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వైస్‌చైర్మన్ కనకాల మహాలక్ష్మీ, మాజీ చైర్‌పర్సన్ ముప్పన శ్యామలాంబ, కౌన్సిలర్లు అంబిక, సత్యభాస్కర్, అమీనాబీబీ, ఒబిలిశెట్టి నూకరత్నం, వాసంసెట్టి గంగ, తలారి శ్యామలత, మేనేజరు జ్యోతిరాణి, డీఈఈ ఆదినారాయణ పాల్గొన్నారు.

సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు

సామర్లకోట, జూన్ 29: సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గౌరవ అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశాల్లో ఏ చర్చ లేకుండా అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్టు వైస్ చైర్మన్ జాన్‌మోజెస్ ప్రకటించగా అందుకు ఇటీవలే టీడీపీలో చేరిన కౌన్సిలర్ పిల్లాడి సత్యవతి అభ్యంతరం తెలిపారు. అంశాల వారీగా చర్చించాల్సిందేనని వైసీపీ సభ్యులు కరణం రాజకుమార్, చల్లపల్లి శ్రీను పట్టుబట్టారు. రాజప్ప మాట్లాడుతూ అభివృద్ధిపై సభ్యులు చర్చ చేయవచ్చని వ్యతిరేఖత లేకుండా మంచి అభివృద్ధికి అందరూ సహకరించాలని సూచించారు. పట్టణంలో ప్రధానంగా పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీరు సరఫరాలో అధికారులు, కౌన్సిల్ శ్రద్ధ వహించాలని తెలిపారు. తాను దశాబ్దికాలంగా నియోజకవర్గ శాసనసభ్యుడిని అయినా తనకు ఇవ్వాల్సిన గౌరవం చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ ఇవ్వకున్నా తనను ప్రజల మనిషిగా, ప్రజల సమస్యలు పరిష్కరించే ప్రజాప్రతినిధిగా గౌరవించానన్నారు. అంతకుముందు సామర్లకోట కౌన్సిల్ మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన నిమ్మకాయల చినరాజప్పను కమిషనర్ జాస్తి రామారావు ఆధ్వర్యంలో కౌన్సిల్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ధాన్యానికి డబ్బులు చెల్లించాలి



పి.మల్లవరంలో రైతుల ఆందోళన

తాళ్లరేవు, జూన్ 29: ప్రభుత్వం రైతుల వద్ద తీసుకున్న ధాన్యానికి డబ్బులు చెల్లించాలని రైతులు శనివారం పి.మల్లవరంలో ఆందోళన వ్యక్తం చేశారు. కౌలురైతు సూరంపూడి సూరిబాబు మాట్లాడుతూ దాళ్వా పంట వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పండించిన పంటను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలుచేసి 2 నెలలవుతుందని, నేటికి డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు అప్పుల బాధతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తొలకరి పంటకు పెట్టుబడులు లేక రైతులు ధాన్యం డబ్బులు కోసం ఎదురు చూస్తున్నామని, మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా అధికారులు స్పందించి ధాన్యం డబ్బులు రైతులు ఖాతాల్లో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మొగలతుర్తి నాగేంద్రరావు, రాయుడు సింహాచలం, నేతల నాగార్జున, ధూళిపూడి సుబ్బారావు, నేతల లక్ష్మణరావు, ఉండ్రు శ్రీనివాస్, దంతులూరి వర్మ,ఆనాల పాపారావు ఉన్నారు.

'ధాన్యం బకాయిలను చెల్లించాలి'

కరప, జూన్ 29: రబీ ధాన్యం బకాయిలను తక్షణం చెల్లించాలంటూ పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు శనివారం జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగిరెడ్డి గంగాధర్, బోగిరెడ్డి కొండబాబులు రైతులతో కలిసి కరప రైతుభరోసాకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వీఏఏ ప్రశాంత్‌కుమార్ నుంచి ధాన్యం బకాయిల వివరాలను తెలుసుకున్నారు. 200మంది రైతులు ఈ కేంద్రం ద్వారా 999 టన్నుల ధాన్యాన్ని అమ్మితే ఇప్పటి వరకు కేవలం 36మంది రైతుల బ్యాంక్ ఖాతాలకు మాత్రమే సొమ్ములు పడ్డాయని, మిగిలిన రైతులకు రూ.1.73 కోట్ల మేర ధాన్యం సొమ్ములు చెల్లించాల్సి ఉందని తెలుసుకుని విస్తుపోయారు. సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'కుళాయిల ద్వారా కలుషిత జలాలు'



కలుషిత జలాలను చూపుతున్న టీడీపీ నేతలు

గొల్లప్రోలు, జూన్ 29: పట్టణంలో కుళాయిల ద్వారా కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని తెలుగుదేశం పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణం పరిస్థితి మెరుగుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో నాయకులు శనివారం గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనరు రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కుళాయిల ద్వారా వచ్చిన కలుషిత నీటిని కమిషనరుకు చూపించారు. పలు చోట్ల పైపులైన్లకు లీకులు ఉన్నాయని, తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా, పారిశుధ్యం మెరుగుకు తక్షణ చర్యలు చేపట్టాలని లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

యనమల కుటుంబం పూజలు



అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో యనమల సతీమణికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ మాధవి

మామిడికుదురు, జూన్ 29: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి వేదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ ఏసీ జి.మాధవి ఆమెకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బొంతు సూర్యభాస్కరరావు, గుబ్బల సింహాద్రి, కంకిపాటి సుబ్బారావు, కోలా రాంబాబు, కాకి వాసు, కంకిపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, విజయలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు మురమళ్ల వీరేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి యనమల కుటుంబ సభ్యులు వీరేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి చిత్రపటం బహూకరించి ఆలయ అర్చకులు వారిని సత్కరించారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి

శంఖవరం, జూన్ 29: మండలంలోని నెల్లిపూడి గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయవరపు హేమంత్ (26) మృతిచెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నెల్లిపూడి గ్రామానికి చెందిన హేమంత్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా కత్తిపూడి నుంచి శంఖవరం వెళ్లే ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. తుని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో అతడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్లు సకాలంలో అందజేయాలి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 29: జూలై 1న జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియపై సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, వెల్ఫేర్ సెక్రటరీలతో సమావేశమయ్యారు. నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమవారం ఉదయం 6గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం ఉన్న పింఛన్‌ను రూ.3వేలు నుంచి రూ.4వేలకు పెంపుదల చేస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. పెంచిన పింఛన్ మొత్తాన్ని ఏప్రిల్, మే, జూన్ 3 నెలలు కలిపి మొత్తం రూ.7వేల చొప్పున పంపిణీ చేస్తున్నారని చెప్పారు. ప్రతి సచివాలయ పరిధిలో పింఛన్ల పంపిణీ క్రమ పద్ధతిలో ప్రతిఒక్కరికీ సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా ద్వారా సాధ్యమైనంత వరకు నూటికి నూరు శాతం 1వతేదీ సాయంత్రం లోపుగా పంపిణీ చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో 30,552మంది లబ్ధిదారులకు రూ.21.30కోట్ల సొమ్ము పంపిణీ చేస్తున్నామన్నారు. ఆయా సచివాలయ కార్యదర్శులకు లక్ష్యాన్ని నిర్దేశించి ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎస్ఈ పి.సత్యకుమారి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, సచివాలయాల కార్యదర్శులున్నారు.

ముంపు శాశ్వత పరిష్కారానికి చర్యలు

కాకినాడ కమిషనర్ వెంకటరావు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 29: వర్షం కారణంగా ఏర్పడే ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. స్థానిక శిగల లక్ష్మీనారాయణనగర్ ప్రాంతంలో మదర్‌థెరిస్సా విగ్రహం నుంచి ఫౌండేషన్ ఆస్పత్రి మీదుగా చర్చి వరకు ముంపునకు గురైన ప్రాంతాన్ని శనివారం ఆయన సందర్శించారు. ముంపు సమస్య ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగానికి చెందిన అధికారులతో చర్చించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజారోగ్య విభాగాన్ని ఆదేశించారు. ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏఈ వై.నాగేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు ఉన్నారు. ఎంతో చరిత్ర కలిగిన గాంధీనగర్ పార్క్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆయన ఎస్ఈ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలిసి గాంధీపార్కును సందర్శించారు. పార్కులో పర్యటించి అక్కడి వాకర్స్‌తో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ రవివర్మ ఉన్నారు. రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారశాఖామంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ పర్యటకు వచ్చిన సందర్భంగా కాకినాడ కమిషనర్ శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

టిడ్కో ఇళ్లలో అరకొర వసతులతో సతమతం



కాకినాడ పర్లోవపేటలోని టిడ్కో ఇళ్లు

కాకినాడ సిటీ, జూన్ 29: పర్లోవపేటలోని టిడ్కో ఇళ్లలో అరకొర వసతులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వంలో అన్ని హంగులతో ముస్తాబు చేసిన టిడ్కో ఇళ్లకు వైసీపీ రంగులు వేసి లబ్ధిదారులకు అప్పగించారు. ఈ ఇళ్ల సముదాయంలో ఏ సౌకర్యాలు లేక చాలాకాలం లబ్ధిదారులు ఇళ్లలోకి దిగలేదు. తర్వాత కొందరు దిగినా తాగునీటి పైప్‌లైన్లు, ఇంటర్నల్ రోడ్లు, డ్రెయిన్‌లు సరిగ్గా లేకపోవడంతో నివాసముంటున్నవారు సతమతమవుతున్నారు. పదిరోజుల పైడా పంప్‌హౌస్ పనిచేయకపోవడంతో వాడకం నీటికోసం ఇబ్బందులు పడినా పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి పరిస్థితి తెలుసుకోకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేస్తున్నాయి. ఇటీవల ఏడీబీ రోడ్డులో మెయిన్‌పైప్ మరమ్మతుల నిమిత్తం 5 రోజులు తాగునీటి సరఫరా నిలిపివేసిన సమయంలో టిడ్కో ఇళ్లవాసులకు ట్యాంకుల ద్వారా తాగునీరు సరిగా అందనేలేదు. కార్పొరేటర్లు మాజీలు కావడం, ప్రభుత్వం మారడం వంటి పరిస్థితుల్లో ప్రజల వద్దకు వచ్చి సమస్య తెలుసు కోవడానికి స్థానిక ప్రాతినిధ్యం లేకుండా పోయింది.

గ్రామాల్లో అపారిశుధ్యం!

ప్రత్తిపాడు, జూన్ 29: మండలంలోని పలు గ్రామాల్లో అపారిశుధ్యం నెలకొంది. వరుసుగా 4రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో రహదారులు చిత్తడిచిత్తడిగా మారి బురదమయం కావడం దీనికి తోడు డ్రైన్‌లు, వర్షపునీరు మిళితమై దుర్గంధ భరిత వాతావరణం నెలకొంది. ముఖ్యంగా చినశంకర్లపూడిలో పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. ఈ గ్రామంలో ప్రధాన రహదారులతో పాటు వీధులు కూడా వర్షాలకు మురికినీరు, బురదమయంగా మారాయి. దీంతో అంటు వ్యాధులు ప్రబలే సూచనలు ఉండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి పెద్దిపాలెం, ఉత్తరకంచి, ప్రత్తిపాడు, ధర్మవరం, పోతులూరు, చింతలూరు, గజ్జనపూడి తదితర గ్రామాల్లో ఉంది. ప్రస్తుతం డయేరియా, తదితర వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న అపారిశుధ్యంపై అధికార యంత్రాంగం దృష్టి సారించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చినశంకర్లపూడిలో చిత్తడి చిత్తడిగా ప్రధాన రహదారి



పిఠాపురంలో లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న అదనపు జిల్లా జడ్జి వాసంతి

జాతీయ లోక్ అదాలత్

పిఠాపురం, జూన్ 29: పట్టణంలోని కోర్టుల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి పర్యవేక్షణలో జరిగిన ఈ అదాలత్‌లో 111 కేసులను పరిష్కరించారు. రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన భార్యకు రూ.50లక్షల పరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అందజేశారు. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, జూనియర్ సివిల్ జడ్జి ఎం. విజయరామేశ్వరి, న్యాయవాదులు కె.వీరభద్రరావు, ఎస్వీ రాదాకృష్ణ, వైవీఎస్ మూర్తి, డి.రమేష్ బాబు, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు, జూన్ 29: ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 67కేసులు పరిష్కారం అయ్యాయి. జడ్జి కాటం భాను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో 55 కోర్టుకేసులు, 12 ప్రీ లిటిగేషన్ బీఎస్ఎన్ఎల్‌కు చెందిన కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ కె.సూర్యప్రకాశరావు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి, కిర్లంపూడి మండలాల పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



జేఎన్టీయూకే, జూన్ 29: సత్యస్కాన్స్, డయాగ్నోస్టిక్ సెంటర్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సత్య చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివిన 510 మార్కులకు పైబడి సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరచిన 60మందికి రూ.7.20 లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేసినట్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కాదా వెంకటరమణ తెలిపారు. జేఎన్టీయూకేలోని అలుమ్నీ ఆడిటోరియంలో శనివారం స్కాలర్‌షిప్‌ల పంపిణీలో ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ, విశిష్ట అతిథిగా కేఎస్‌పీఎల్ సీవోవో మెర్ల మురళీధర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జీఎస్ఎన్.మూర్తి, భాష్యం జోనల్ ఇన్‌చార్జ్ వి.గోవిందరాజులు పాల్గొన్నారు. డాక్టర్ కాదా వెంకటరమణ చేస్తున్న కృషి అభినందనీయమని అతిథులు అన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఆదిత్య డైరెక్టర్ శృతిరెడ్డి, డాక్టర్లు కె.విష్ణుమూర్తి, లక్ష్మణమూర్తి, పీఎస్ రాజు పాల్గొన్నారు.

నేను బడికి పోతా ర్యాలీలు

తొండంగి, జూన్ 29: పాఠశాల విద్యార్థుల నమోదు వారోత్సవాల్లో భాగంగా శనివారం ఎ.కొత్తపల్లిలో నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంఈవో షేక్ బాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు ఉన్నాయని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నందువల్ల తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వరరావు, పి.సత్యారావు పాల్గొన్నారు.

కరప: గురజనాపల్లి హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన తల్లిదండ్రుల సమావేశంలో సర్పంచ్ అనుసూరి శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం ఎంపీటీసీ వీరవేణి, హెచ్ఎం సాయి మోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు వేణుగోపాల్, రమణి, శ్రీలక్ష్మి, అంగన్‌వాడీలు, తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు.

బాల్య వివాహాలపై కళాజాత

గండేపల్లి, జూన్ 29: గండేపల్లిలో బాల్య వివాహాలు, అతిసారంపై శనివారం కళాజాత నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు జగ్గంపేట సీడీపీవో ఎం.హర్షిమ, ఎంపీడీవో ఎస్.హనుమంతరావు, ఈవోపీఆర్డీ వీఎస్ఎన్ మూర్తి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే శిక్ష తప్పదన్నారు. ఇటీవల అతిసారం వ్యాపిస్తున్నందున ప్రజలు పరిశుభ్రత పాటించాలన్నారు. డాక్టర్ కెవి నరేష్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.నాగపార్వతి తదితరులున్నారు.

హైస్కూళ్ల పరిశీలన

రౌతులపూడి, జూన్ 29: మండలంలోని రౌతులపూడి, లచ్చిరెడ్డిపాలెం, బలరామపురం, మూలగపూడి, ఎస్. అగ్రహారం గ్రామాల్లో హైస్కూళ్లను పెద్దాపురం డిప్యూటీ విద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు పరిశీలించారు. విద్యార్థులకు పలుసూచనలు చేశారు. ఉపాధ్యాయులు ప్రస్తుత విద్యావిధానానికి అనుకులంగా పనిచేయాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో గాడి కొండబాబు, ప్రధానోపాధ్యాయులు కోళ్ల రాంబాబు, శేషుకుమార్, మురళీకృష్ణ, సతీష్‌లు ఉన్నారు.

నాణ్యతలేని కొబ్బరి మొక్కలు

తాళ్లరేవు, జూన్ 29: కోరింగ పంచాయతీ మంచినీటిచెరువు గట్టున జాతీయ ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు సోషల్ ఆడిట్ బృందం దృష్టిని మళ్లించేందుకు నాణ్యతలేని కొబ్బరిమొక్కలను పాతిన సంఘటన వెలుగులోకి వచ్చింది. గతంలో వేసిన 130 కొబ్బరి మొక్కలు చనిపోతే వాటిస్థానంలో నాణ్యతలేని వెర్రికొబ్బరి మొక్కలను నాటి సామాజిక తనిఖీ బృందానికి దొరకుండా క్షేత్ర సహాయలు నాటారు. దీంతో కొబ్బరికాయ లేని మొక్కలు ఉంటాయో పోతాయో కూడా తెలియని పరిస్థితిఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి చోరీ

రౌతులపూ, జూన్ 29: ఎస్ఎస్‌పట్నం గ్రామశివారు చినవెంకన్నపడాలపురం గ్రామంలో నలుగురు రైతులకు చెందిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి చోరీకి గురైంది. రాత్రి వ్యవసాయ పనులు ముగించుకుని వచ్చేసరికి ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయని, శనివారం తెల్లవారు జామున పొలంలోకి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్లలో రాగిని ఎవరో దొంగిలించి కింద పడేశారని రైతులు అల్లం రామన్నదొర, అల్లు బాబు తదితరులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రొట్టెలు, ఆహార ప్యాకెట్ల పంపిణీ

జగ్గంపేట, జూన్ 29: రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు బద్ది సురేష్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పౌష్టికాహార కిట్ల అందజేత

తొండంగి, జూన్ 29: కాకినాడ సెజ్ అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ సుమారు రూ.700 విలువ గల కిట్లను సంస్థ ప్రతినిధులు తొండంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధితులకు అందించారు. డాక్టర్ కిశోర్ ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్

ఏలేశ్వరం, జూన్ 29: ఏలేశ్వరం ఇన్‌చార్జి ఎంపీడీవోగా కె.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీవో అరుణ కాకినాడకు బదిలీ అయ్యారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని శ్రీనివాస్ తెలిపారు. వెలుగు, విద్యాశాఖ సిబ్బంది, పలువురు ఆయన్ని అభినందించారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

తొండంగి, జూన్ 29: రైతు సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్ అన్నారు. తొండంగి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. సోమాల ప్రసాద్, మాజీ సర్పంచ్ నేమాల కృష్ణ, ఎం.సత్యనారాయణ, పక్కుర్తి నూకరాజు, సత్తిబాబు ఉన్నారు.

పీఎం, సీఎం చిత్రపటాల బహూకరణ

జగ్గంపేట, జూన్ 29: గోకవరం రోడ్‌లోని గురుకుల పాఠశాలకు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చిత్రపటాలను పాఠశాల ప్రిన్సిపాల్ రాజకుమారి, వైస్ ప్రిన్సిపాల్ జోష్నాలకు యల్లమిల్లి టీడీపీ నాయకుడు సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ బహూకరించారు.

20వరోజు ఆర్టీసీ డ్రైవర్ల నిరసన

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 29: అన్యాయంగా డ్రైవర్ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేయడంపై ఆర్టీసీ డ్రైవర్లు తెలుపుతున్న నిరసన శనివారంతో 20వ రోజుకు చేరుకుంది. డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోకుండా ఆర్టీసీ డిపో డీఎం ఏకపక్ష నిర్ణయంపై కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మహిళల భజన సంకీర్తనలు

ప్రత్తిపాడు, జూన్ 29: ప్రత్తిపాడు నరేంద్రగిరి శ్రీరామ నామ క్షేత్రం వద్ద స్థానిక మున్సిబ్ వారి వీధి మహిళా భక్త బృందం శ్రీరామనామ భజన సంకీర్తనలు నిర్వహించారు.